29032024-MAI-04_Layout 1 3/29/2024 1:54 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ఉపాధిలో తీసికట్టు

అద్దం అబద్ధం చెప్పదు. బింబానికి ప్రతిబింబాన్ని చూపిస్తుంది. మన ముఖంలో ఏవైనా మరకలుంటే వాటిని తుడిచేసుకునే ప్రయత్నం చేయాలి కానీ, అద్దాన్ని నిందించడం తగదు. కానీ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పదే పదే ఆ పనే చేస్తున్నది. అంతర్జాతీయ రేటింగ్స్ వెలువడిన ప్రతిసారీ బీజేపీ నేతలు విరుచుకుపడుతున్నారు. సిద్ధాంతాలు చెప్పి రాద్ధాంతం చేస్తున్నారు. అంతా పశ్చిమ దేశాల కుట్ర అంటూ కొట్టిపారేస్తున్నారు. కొందరైతే ప్రత్యామ్నాయ రేటింగ్స్ వ్యవస్థ ఏర్పాటుచేసుకోవాలని సెలవిస్తున్నారు. పదేండ్ల మోదీ పాలనలో దేశం అధోగతి పాలైనట్టు ఆ రేటింగ్స్ ఎత్తిచూపడమే వారి కోపానికి కారణమని చెప్పాలి. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు పదేండ్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా సహజంగానే అంతర్జాతీయ సూచీల్లో మన స్థానం ఏమిటా? అనే ఆసక్తి కలగడం సహజం. ముందుకు వెళ్లామా లేక వెనుకకు మళ్లామా? అనే చర్చ కూడా జరుగుతుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్వో) తాజాగా విడుదల చేసిన నివేదికలో భారతదేశంలో ఉపాధి పరిస్థితులు నిరాశాజనకంగా ఉన్నాయని పేర్కొన్నది. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు క్రమంగా తగ్గిపోతుండటాన్ని ఎత్తిచూపింది. నిరుద్యోగుల్లో యువత శాతం 54.2 నుంచి 65.7కు పెరిగింది. పట్టణ ప్రాంతాల్లోని చదువుకున్న యువతకు ఉపాధి అంతంత మాత్రంగానే అందుబాటులో ఉండటమే అందుకు కారణం. ప్రభుత్వం ఈ నివేదికను కొట్టిపారేసింది. స్వదేశీ అధ్యయన సంస్థల నిర్ధారణలు మరోలా ఉన్నాయని అంటున్నది. ఇంకా విదేశీ నివేదికల మీద ఆధారపడే బానిస గుణం మనలో ఇంకా పోలేదని ఓ కేంద్రమంత్రి వ్యాఖ్యానించడం కొసమెరుపు. రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఆ హామీ నిలబెట్టడంలో ఘోరంగా విఫలమైంది. బజ్జీల బండి పెట్టుకోవడమూ ఉపాధి కిందకే వస్తుందని ఆ పార్టీ నేతలు దబాయించడం తెలిసిందే.

జీడీపీ పెరిగినట్టు నివేదికలు వస్తే ఉత్సాహంగా టాంటాం వేసుకునే కేంద్రం పెరిగిన సంపద సమంగా పంపిణీ అవడం లేదని తెలిపే నివేదికలు, సూచీలపై చిరాకు పడుతుండటం విచిత్రం. పోటీగా స్వదేశీ సూచీలు తీసుకురావాలి అనేదాకా పోయింది ఈ ధోరణి. ఆ మధ్య విడుదలైన అంతర్జాతీయ ఆకలి సూచీలో 125 దేశాల్లో భారత్ కు 111వ ర్యాంకు వచ్చినప్పుడు చాలామంది ఔరా ఎంతగా వెనుకబడిపోయామని విస్తుపోయారు. కానీ, ప్రభుత్వం మరోలా స్పందించింది. ఆ సూచీ ఓ తప్పుల తడక అనీ, దురుద్దేశాలతో దానిని రూపొందించారని మండిపడింది. కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ఆ సూచీని ఎద్దేవా చేయడంపై దుమారం చెలరేగడం తెలిసిందే.

జీడీపీలో అమెరికా, చైనా, జపాన్, జర్మనీ తర్వాత ఐదో స్థానంలో నిలిచిన మన దేశంలో ఆహార ఉత్పత్తి కూడా గణనీయంగా పెరిగింది. అయినప్పటికీ అర్ధాకలితో లేదా పూర్తి పస్తులతో గడుపుతున్న పేదల సంఖ్య పెరగడం దేనిని సూచిస్తున్నది? సంపద సమ పంపిణీ జరగకపోవడం, ధనిక-పేద వ్యత్యాసాలు పెరిగిపోవడం ఈ పరిస్థితికి కారణమని ఎవరైనా చెప్తారు. మొన్నటికి మొన్న అంతర్జాతీయ సంతోష సూచీలో 146 దేశాల్లో మన దేశానికి 126వ ర్యాంకు రావడంపై కూడా కేంద్రం విమర్శలు సంధించింది. జీవితానికి భరోసా, పర్యావరణ రక్షణ వంటి కీలక అంశాల ఆధారంగా రూపొందే ఈ ఐక్యరాజ్యసమితి నివేదికను విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ గతంలో మైండ్ గేమ్ అని కొట్టిపారేశారు. సంపద, అదీ ధనవంతుల సంపద పెంచుతూపోతున్న కేంద్ర ప్రభుత్వం పేదలకు ఆసరా కల్పించడంలో విఫలమవుతుండటమే ప్రస్తుత దీనస్థితికి కారణం. కావాల్సింది పోటీ సూచీలు కాదు, అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయిన పేదలకు తక్షణ ఆసరా, బతుకు భరోసా కల్పించడం.

జవాబు లేని ప్రశ్న

నన్ను అరెస్టు చేశారు కానీ, ఏ కోర్టు కూడా నేను దోషినని నిరూపించలేదు. సీబీఐ 31 వేల పేజీల చార్జిషీట్, ఈడీ 25 వేల పేజీల చార్జిషీట్‌ను సమర్పించింది. ఆ రెండింటిని కలిపి చదివినా.. నన్ను ఎందుకు అరెస్టు చేశారనే ప్రశ్న మిగిలే ఉంటుంది.

- అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి

మీమాంస వద్దు మిత్రులారా!

గత కొద్ది నెలలుగా మన రాష్ట్రంలో, ఆ మాట కొస్తే దేశంలో సాగుతున్న 'రాజకీయ అవినీతి' గురించి మొన్నొక ప్రొఫెసర్ నాతో మాట్లాడుతూ 'రాజకీయాలు భ్రష్టు పట్టినయి. ఈ పార్టీ ఆ పార్టీ అని లేకుండా అందరూ అవినీతి పరులే. ప్రజలకు రాజకీయంపై నమ్మకం పోతున్నది' అన్నడు కోపంగా, నిరాశగా!

'మీకోటి తెలుసా? వార్డు మెంబర్, సర్పంచ్ మొదలుకొని చిన్నస్థాయిలలో కూడా ఎట్లుంటరో? పోటీ చేసేప్పుడు 'నో డ్యూ సర్టిఫికెట్' మ్యాండేటరీ కాబట్టి ఏండ్లుగా కట్టకుండా వదిలేసిన ఇంటిపన్ను లాంటివి తప్పనిసరై కడుతరు. అయిదారు వందలు సైతం తమ పార్టీ నాయకులే ఇయ్యాలంటరు. ఎప్పుడూ ఎన్నికల్లో పోటీ చేయనివారు జీవితంలో కట్టరు ఇంటిపన్ను! మీరు మీ సొంత ఊరిలో కనుక్కోండి తెలుస్తది. పోనీ ఊళ్ళల్లో మీకు సొంత ఇల్లు ఉంటే, పన్ను కట్టిన్రో లేదో చూసుకోండి. ఇదంతా పునాది అవినీతి అన్నమాట. ఇది పార్టీలకు, రాజకీయాలకు మాత్రమే కాదు... మన సమాజమే అంత మనలో చాలా మందిమి కూడా 'అతి చిన్న స్థాయి' అవినీతి చేస్తూ ఉంటము...

శ్రీశైల్‌రెడ్డి పంజుగుల
90309 97371

'దేశాన్ని సుదీర్ఘకాలం పాలించి, పేదరికాన్ని కదలకుండా కాపాడిన 139 ఏండ్ల వయసు గల పార్టీయా, దేశాన్ని మత మౌఢ్యం వైపు తీసుకుపోతున్న ద్వేష భక్త పార్టీయా, గుణాత్మక మార్పు కోసం ప్రత్యామ్నాయాలతో ముందుకువస్తున్న శక్తులా... వీరిలో ఎవరి ట్రాక్ రికార్డ్ ఏమిటి? అని కదా చూడాలి. మహా బలశాలులమని విర్రవీగేవారిని ఎదిరిస్తున్న ప్రత్యామ్నాయ శక్తులను జైళ్లలో కుక్కుతున్న అవినీతి రాజకీయం ఎన్ని లక్షల కోట్ల రూపాయల కంటే తక్కువ అనైతికం?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వ పాలన సర్వమూ అవినీతిమయమని వంద రోజులుగా చెప్పిన మాట చెప్పకుండా చెప్తున్నరు. 'తెలంగాణ బిడ్డలు, అమరులు, ఉద్యమం' అంటూ తనకు సంబంధం లేని పదజాలం వాడుతున్నరు. ఓటుకు కోట్లిచ్చి టీవీలకు దొరికిపోయిన నాయకుడు సచ్ఛీలుడుగా ఫోజు కొడుతున్నరు. ఇది కదా అసలు అవినీతి!

పోనీ... అయాచితమో, అపాత్రదానమో... తనకు సంక్రమించిన పదవిని సదుపయోగం ఏమన్న చేస్తున్నరా? తెలంగాణను నిలువునా ముంచుతున్నరు కదా రేవంత్ రెడ్డి?

> నీళ్లు లేవు, అడ్జెస్ట్ కండి అంటున్నడు. నిధులు కాంగ్రెస్ అధిష్టానానికి కప్పం రూపంలో తరలిస్తున్నరు. అందుకే ఎల్ఆర్ఎస్ రూపంలో దోస్తున్న, రైతుబంధు ఆపుతున్న, పింఛన్లు ఇయ్య, రుణమాఫీ ఇయ్య అంటున్నడు. వచ్చి వందరోజులు కాలేదు, ముప్పై వేల కొలువులు ఇచ్చిన అంటున్నడు, పాత ప్రభుత్వపు పంటను ఏరుకుంటూ.

అట్లా 'నీళ్లు- నిధులు- నియామకాలు' అనే తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్య ప్రకటనకు నీళ్లు ఒదిలేసిండు రేవంత్ రెడ్డి.

'కేసీఆర్ చానా చేసిండు. కొన్ని సరిగా చేయలేదు. ఇంకొన్ని పట్టించుకోలేదు. కానీ, తెలంగాణకు నష్టం చేయాలని ఆయన ఏనాడూ అనుకోలేదు. జీవితంలో కూడా అనుకోడు. తెలంగాణపై కేసీఆర్ ప్రేమను రేవంత్ రెడ్డి ఏం ఖర్మ, రేవంతు గురువు చంద్రబాబు కూడా శంకించలేడు...'

మొన్న హెయిర్ కటింగ్ చేస్తూ నాతో మా బార్బర్ శ్రీనివాస్ అన్న మాటలవి. హెయిర్ కటింగ్ సెలూన్‌లు మన పల్లె టూళ్లలోని రచ్చబండ లాంటివి. లోకాభిరామాయణాల లాగనే అనిపిస్తయి పైకి... కానీ చాలా లోతైన విషయాలు మాట్లాడుతరు. అలవోకగా పదాలు దొర్లుతుంటయి. డేటా, స్టాటిస్టిక్స్, మనవాళ్లా కాదా వగైరా ఉచ్చులలో పడి మేధావులు సంశయాత్మక జీవులుగా ఉంటరు కానీ... 'పామరులు' సూటిగా సుత్తి లేకుండా మాట్లాడుతరు.

ఆరు వేల కోట్ల రూపాయల నిధులు ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో సేకరించిన బీజేపీ అసలైన అవినీతి సామ్రాట్టు. లిక్కర్ స్కాం మిషతో కేసీఆర్ కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాలనుకొని కవితను అరెస్టు చేయించింది బీజేపీ. కానీ, అదే లిక్కర్ స్కాంలో దోషిగా వారే పేర్కొన్న వ్యక్తి దగ్గర 50 కోట్లు బాండ్ల రూపంలో తీసుకొని ఆయనకు క్షమాభిక్ష ప్రసాదించిన్రు. ఇది కాదా అవినీతి? ఈడీ, ఈసీ, ఐటీ, సీవీసీ అందరూ 'మేం బీజేపీలో చేరం, బయటి నుంచి మద్దతు ఇస్తం' అన్నట్టుగా లేదూ ఈ మిలాఖత్? లిక్కర్ స్కాం దూది పింజె వంటిది కదా ఈ అవినీతి అనకొండల ముందు?

ఇది ఎట్లా ఉంటుందంటే, భారతదేశం అవినీతిమయం అని చెప్పే పశ్చిమ దేశాలు పరమ అనైతికంగా చిన్న దేశాలపై దాడులు చేసి, యుద్ధాలు చేసి, మారణహోమం సృష్టించి సహజ వనరులను కొల్లగొట్టి... తమ దేశ ప్రజల దృష్టిలో మాత్రం అవినీతి ఎరుగని పాలన అందించే సచ్ఛీలురు లాగా ఆమోద ముద్ర వేయించుకోవడం లాంటిది.

ప్రజల విషయానికి మళ్లీ వద్దాం.

కేసీఆర్ ఇచ్చిన దళితబంధు విప్లవాత్మకమైన విధానం కాదా? విడతల వారీగా అందరికీ వస్తుంది అన్న కాన్ఫిడెన్స్ ఉండాలి కదా? నలుగురు పిల్లలున్న ఇంటిలోనే అందరి కోర్కెలూ (అవి ఎంత న్యాయమైనవి అయినా) ఒక్కసారే తీర్చలేరే తల్లిదండ్రులు? మరి రాష్ట్రాన్ని నడపాల్సిన తండ్రికి ఎన్ని బాధ్యతలు, ఎన్ని జాగ్రత్తలు, ఎంత ప్లానింగ్ ఉండి ఉండాలి? ఏడెనిమిదేండ్ల పాలనలోనే ప్రజల జీవితాల్లో మార్పులు తేగలిగిన నాయకుడికి ఇంకింత సమయం ఇవ్వాలి కదా?

> దళితబంధు ఉదాహరణలోనే చూద్దాం... మేలు జరిగిన కుటుంబాలు మిగిలినవారికి చెప్పి ఉండాలి కదా? అందరికీ అవకాశాలు ఒస్తయని ఒప్పించి ఉండాల్సింది కదా? రాని వారు కూడా కొంచెం నిలీక్షిస్తే ఏమయ్యేది? ఇదే మాట బీసీ బంధు, గృహలక్ష్మి, మైనారిటీ బంధు అన్నిటికీ వర్తిస్తుంది. ఏడున్నర దశాబ్దాల ఏలుబడి పాపాలను ఏడున్నరేండ్లలో తుడిచిపెట్టగల మంత్రదండం ఏమీ లేకుండె కదా కేసీఆర్ దగ్గర? ఆయన సంకల్పానికి ఆయువు పోయాల్సిన ప్రజలు అలిగి కూచుంటే ఎట్లా? చెరువు మీద కోపం చూపడం కాదా ఇది?

ఒకటో తారీఖు జీతం పడటం లేదని కినిసిన గురువులు కొంచెం ఆలోచించి ఉండవలసింది కదా? అభివృద్ధి- సంక్షేమ పథకాల ద్వారా; ఐటీ/ పారిశ్రామిక ప్రగతి ద్వారా; ఫలసాయాలతో కళకళలాడే గ్రామీణ కుటుంబాల రూపంలో అందరూ బాగుపడ్డరు కదా? అందులో మీ కుటుంబాలూ ఉన్నయి కదా? బోధకులకు హ్రస్వదృష్టి తగునా? నెలజీతం కాస్త అటూ ఇటూగా వస్తే మాత్రం ఏమైంది? మీ ఆగ్రహం ఇపుడు పై అన్ని వ్యవస్థలకూ తూట్లు పొడిచే పాలనగా రూపుదాల్చి... మీకేమైనా సంతోషం మిగిల్చే సర్వతోముఖాభివృద్ధి జరుగుతున్నదా? మీ స్వగ్రామమో, మీరు పనిచేసే ఊరో... వందరోజుల కిందట కంటే ఇపుడు వెలిగిపోతున్నదా లేక కునారిల్లుతున్నదా?

నిరుద్యోగ యువతా... మీకు భృతి దొరుకుతున్నదా?

'ప్రగతిభవన్' ప్రజాభవన్‌గా; 'టీఎస్' 'టీజీ'గా నామాంతరం చెందినయి తప్పిస్తే ఏం ఒరిగింది? కొత్త పాలకుడు చుక్కలు చూపిస్తున్నడు కదా? దళితబంధు మర్చిపోండి... రైతుబంధే ఇవ్వడం లేదు కదా? ఇస్తానని ఆయనే చెప్పిన ఏ ఒక్క హామీ నెరవేరడం లేదు కదా? రేపు పార్లమెంట్ ఎన్నికలయ్యాక ఇంకా తీసికట్టు అవుతుంది కదా తెలంగాణ! పోనీ రేవంత్ రెడ్డి ఎపుడన్నా తెలంగాణవాదం మాటవరసకైనా తలకెత్తుకున్నడా? ఉద్యమకారులపై తుపాకీ చూపించిన నాయకుడు కదా? ఈ రోజు సీఎం హోదాలో ఏ సభలోనైనా 'జై తెలంగాణ' అంటున్నడా? తెలంగాణ చిహ్నంలోంచి కాకతీయ తోరణం తీసివేయడం, తెలంగాణ తల్లి రూపం మార్చడం ద్వారా ఆయన మరపింపజూస్తున్నది కేసీఆర్‌ను కాదు, తెలంగాణ ఉనికినే లేకుండా చేసే అతిపెద్ద దుస్తంత్రం. మరి తెలంగాణ మేధావుల మౌనంలో ఏమి నైతికత ఉన్నది? ఇంకా శాప విముక్తి జరగాలి బీఆర్ఎస్‌కు. తాము విధించిన శిక్షను మనస్ఫూర్తిగా ఆహ్వానించి, అనుభవించి, పునీతులై వస్తే అక్కున చేర్చుకుంటరు ప్రజలు. మాటలోనూ, చేతలోనూ, భాషలోనూ, బాడీ లాంగ్వేజీలోనూ అది కనపడాలి. యే కోశానా తెలంగాణ ఆత్మలేని రేవంత్‌రెడ్డి ప్రేమ నాటకాలాడుతూ ఉంటే... అచ్చ తెలంగాణ స్వచ్ఛబిడ్డలూ, మీకేమి భేషజం? అన్నరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక కవి మిత్రుడు నాతో. ఆయనలో బీఆర్ఎస్‌ను తప్పు పట్టడం కంటే, రేవంత్‌కు తెలంగాణను అపాత్రదానం చేయడం పట్ల ఆగ్రహం కనిపించింది నాకు.

ఇలాంటి సంక్షుభిత సందర్భంలో... కొందరు బీఆర్ఎస్ నాయకుల అనైతికత చూడండి...!

ఏ ప్రజలైతే తిరస్కరించిన్రో, కండువా మార్చి కొత్తగా ఓటేయమని వారినే అడగడం, మూడు నెలలు కూడా గడవకుండానే అధికార యావతో చొంగ కార్చడం ఎంత సిగ్గులేని తనం? బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు అధికారం చెలాయించి, ఆస్తులు పోగేసుకొని, ఇప్పుడు తప్పంతా అధినేత ఒక్కడిదే అన్నట్టు తాము అవతల పడుతరా? ఆ కుటుంబం కష్టాల్లో ఉన్న సమయంలో ఇట్లా ద్రోహం చేయడం ఎంత అనైతికత!

సీనియర్ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలుగా వెలగబెట్టినవారు అంత బరితెగిస్తే, వారిని ఆలోచనాపరులు ఖండించకపోవడం పార్టీకి ద్రోహం. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం ప్రాణాలు ఇచ్చేవారి పట్ల చేసే అసహ్యమైన వెటకారం!

పార్లమెంటు ఎన్నికలు ముంగిటిలో ఉండగా, పార్టీ ప్రభను పాతాళానికి తొక్కేసే నాయకుల పట్ల అప్రమత్తత అవసరం. శ్రేణులకు ధైర్యం ఇవ్వడం కాదు... వారు ధైర్యంతో పోరాడుతున్నరు, వారికి మ్యాచ్ అయ్యేలా ఉండాలి కదా నాయకుల నైతిక స్థాయి?!

> పదేండ్ల పాలనలో కేసీఆర్ చేసిన మహా పాపాలు ఏమీ లేవు. ప్రతిపక్షాలు వేసే అవినీతి ఆరోపణల ట్రాప్‌కు నాయకులూ, ప్రజలూ, ఆలోచనాపరులు పడకూడదు. వ్యవస్థలను తీర్చిదిద్దడం, చెమటోడ్చి సాధించుకున్న రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దాలనే సంకల్పం తీసుకోవడం, అది దాదాపు సగానికి పైగా సుసాధ్యం చేయడం కేసీఆర్ నైతికత. ఆయన ప్రభపై అసూయ, ఆయన కుటుంబంపై కోపం, ఆయన కులంపై ద్వేషం ఉన్నవారు మినహాయిస్తే... వైతన్యానికి సుక్షేత్రమైన తెలంగాణ గడ్డపై పుట్టిన వారు ఎవరైనా కాస్త ఆగి ఆలోచిస్తే అర్థమవుతున్నది మనం రత్నాన్ని విసిరి రాయి మెడకు చుట్టుకున్నమని.

'ఒక పెద్దమనిషి బాయి తవ్విండు, చేతిల చాద బొక్కెన ఉన్నంతకాలం నీళ్లు చేదిపోసిండు. దూపతీర్చిండు. ఇయ్యాల బాయి అట్లనే ఉంది, బొక్కెన అట్లనే ఉంది. చేదిపోసే దిక్కే లేదు. ఎందుకంటే ఇయ్యాల బొక్కెన చేతుల పెట్టుకున్నోనికి జనం మీద ప్రేమ లేదు, దూపతీరుద్దమనే ఆలోచన లేదు. ఏందిరా అనడిగితే బొక్కెనకు బొక్కలున్నయి అంటున్నడు. బొక్కెన బొక్కలకు అతుకులేపిస్తడేమో అనుకుంటే మాంసం దుకాణంల యాట తలకాయ లెక్క భేజా జాగల బొక్కున్నది వాని తలకాయలనాయి...' అన్నడు ఉదయభాస్కర్ కేశవదాసు అనే మిత్రుడు! నిజమే కద?!

> వంద రోజుల తన పాలనతో రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మన ఆశలను వమ్ము చేసింది. మనందరం సుషుప్తావస్థ నుంచి మెలుకువ తెచ్చుకునే, తెలంగాణను తట్టి లేపే సమయం ఆసన్నమైంది మిత్రులారా, పార్లమెంట్ ఎన్నికల రూపంలో! అందరినీ ఒకటే గాటన కట్టే నిరాశ నుంచి బయట పడుదామా? ప్రతీప శక్తులపై యుద్ధం చేయ కృతనిశ్చయులమవుదామా?

ఈ పిలుపు బీఆర్ఎస్ శ్రేణులకు మాత్రమే కాదు, తెలంగాణ ప్రజలందరికీ. ఎందుకంటే తెలంగాణ మన అందరిదీ. దాన్ని కాపాడుకునే హక్కూ, బాధ్యతా మనదే. జై తెలంగాణ!

తుగ్లక్ నిర్ణయం!

జి.రాజేష్ నాయక్
96035 79115

> అస్తిత్వం కోసం అరువై ఏండ్లు పోరాటం చేసిన చరిత్ర తెలంగాణది. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తన తొమ్మిదిన్నరేండ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం శిఖరాగ్రానికి చేరిందనేది వాస్తవం. ఆయన పాలనలో తెలంగాణ రాష్ట్రం సాధించిన ఘన విజయాలు ఇప్పటికీ కండ్ల ముందు సాక్షాత్కరిస్తాయి. 75 ఏండ్ల స్వాతంత్ర్య భారతదేశంలో ఏ రాష్ట్రమూ సాధించని విజయాలు తెలంగాణ సాధించింది. ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి రెండూ జోడెడ్ల వలె పరిగెత్తాయి.

కొత్త జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు, గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీలను కూడా కేసీఆర్ రూపొందించారు. ఆ విధంగా చేస్తే పాలన వికేంద్రీకరణ జరిగి ప్రజలకు పాలన చేరువవుతుందనే ఆలోచన కేసీఆర్‌ది.

అందుకే, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారిగా 2016లో తెలంగాణ ప్రభుత్వం జిల్లాలు, మండలాలను పునర్వ్యవస్థీకరించింది. అభివృద్ధి పథంలో శరవేగంగా ముందుకువెళ్తున్న తెలంగాణ రాష్ట్రం పరిపాలన వికేంద్రీకరణలో ముందడుగు వేసింది. రాష్ట్రంలోని 10 జిల్లాలను ప్రభుత్వం 33 జిల్లాలుగా విభజించింది. ఈ పరిణామం భవిష్యత్తులో ఎంతగానో ఉపయోగపడుతుందనే ముందుచూపు కేసీఆర్‌ది. ఆయన అనుకున్నట్టుగా పాలన వికేంద్రీకరణతో ప్రజలకు అవస్థలు తగ్గిపోయాయి.

> రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ కొత్త రాగం అందుకుంటున్నది. జిల్లాల కుదింపు అవసరమని స్వయానా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పడం తెలంగాణ సబ్బండ వర్గాల్లో చర్చనీయాంశమైంది. జిల్లాల విభజన జరుగకముందు దూరం, పరిధి వంటి సమస్యలుండేవి. ప్రజలు జిల్లా అధికారులను కలిసేందుకు రావాలంటే సుదూర ప్రయాణం చేయాల్సి వచ్చేది. అలాగే అధికారులకు, ప్రజలకు సంబంధాలు చాలా తక్కువ ఉండేది. జిల్లాల కుదింపు మండలాలపై ప్రభావం పడే అవకాశాలు చాలానే కనిపిస్తున్నాయి.

జిల్లాల విభజన తర్వాత మండలాలు పెద్ద సంఖ్యలో పెరిగాయి. ఇదిలా ఉంటే జిల్లాల ఏర్పాటు అనంతరం ప్రతి జిల్లాకు కలెక్టర్ కార్యాలయాలు రూపుదిద్దుకున్నాయి. అందులోనుంచే పాలన పరుగులు పెడుతున్నది. మరి అలాంటప్పుడు కొత్తగా జిల్లాల కుదింపు ప్రక్రియ జరిగితే ఆ వేళ కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన భవనాల పరిస్థితి అగమ్యగోచరంగా మారే పరిస్థితి నెలకొంటుంది. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలను కుదిస్తే ఈ భవనాలను ఏం చేస్తారనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలిపోతుంది.

జిల్లాల విభజన తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా పెరిగింది. మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో భూముల ధరలు అమాంతం పెరిగాయి. కేవలం హైదరాబాద్ చుట్టుపక్కలే కాకుండా దూర ప్రాంతాల్లోనూ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత భూముల రేట్లలో భారీగా మార్పులు వచ్చాయి. జిల్లాల కుదింపు నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తే గ్రామాల్లో భూముల ధరలు మొత్తానికే పడిపోయే ప్రమాదం పొంచి ఉన్నది. అంతేకాదు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు పూర్తిగా తగ్గిపోయే అవకాశం ఉన్నది. మెడికల్ కాలేజీలు, నవోదయ పాఠశాలలు వంటి కేంద్ర విద్యాసంస్థలు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉండదు. ఇప్పటికే ఉన్న జోనల్ విధానం మీద ప్రభావం పడే ప్రమాదం ఉన్నది. ఉద్యోగులకు కూడా ఇబ్బందులు కలిగే అవకాశం ఉన్నది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని ప్రతి వర్గానికి నష్టం కలిగే ప్రమాదం ఉన్నది.

అధికారంలోకి రావడం కోసం ఇచ్చిన హామీలను పక్కనపెట్టి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్నది. ఏ వర్గానికి మేలు కలుతుందో దేవుడెరుగు. రైతు భరోసా ఊసు లేదు, రైతుబీమాకు ధీమా లేదు, రుణమాఫీ మీద స్పష్టత లేదు. ఫిబ్రవరి 1 నాడు ఇస్తానని చెప్పిన ఉద్యోగ నోటిఫికేషన్లు ఇంకా విడుదల కాలేదు. ఈ రోజు ప్రజలు, రైతులు తాగు, సాగునీరు లేక అల్లాడుతున్నారు. ఈ సమస్యలన్నింటిని పక్కన పెట్టి ఇలాంటి తుగ్లక్ నిర్ణయాలు ఏమిటోనని జనాలు పెదవి విరుస్తున్నారు. రాష్ట్రంలో కరెంట్ కష్టాలు ఎక్కువయ్యాయి. సీఎం రేవంత్ రెడ్డి ఒకవేళ జిల్లాల కుదింపు నిర్ణయం అమలుచేస్తే ఒకరకంగా అది ప్రజల మెడకు గుది బండ వంటిదే.

(వ్యాసకర్త: పరిశోధక విద్యార్థి, ఓయూ)

లేఖలు

టెట్ తెలుగు పేపర్-3 నిర్వహించాలి

ఎస్జీటీగా పదోన్నతి పొందేందుకు టెట్ పేపర్- 1, స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి కోసం పేపర్- 2లను ప్రభుత్వం నిర్వహిస్తున్నది. ఈ విధానం వల్ల తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితులకు అన్యాయం జరుగుతున్నది. టెట్‌లో ఉన్న లోపాలను సవరించి డీఈడీ, బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలి. టెట్ పేపర్- 2లో తెలుగు భాషా పండితులకు సంబంధం లేని సోషల్ సబ్జెక్టు నుంచి 60 మార్కులు ఉండటం వల్ల చాలామంది నష్టపోతున్నారు. భాషా పండితుల కోసం ప్రత్యేకంగా టెట్ తెలుగు పేపర్- 3 నిర్వహించాలి. పేపర్- 1 నుంచి 8వ తరగతిలోపు, పేపర్- 2లో 10వ తరగతి లోపు ఉండేలా చూడాలి. ఏపీలో ఉన్న విధానాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం కూడా అనుసరించాలి.

దేవులపల్లి రమేశ్

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించరూ..

రాష్ట్రంలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పెండింగ్ దరఖాస్తులు, ఫిర్యాదులను పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలి. ఇండ్ల స్థలాల అక్రమణల గురించి రెవెన్యూ అధికారులు, పోలీసుల చుట్టూ తిరిగి తిరిగి చాలామంది విసిగిపోయారు. దరఖాస్తుదారుల్లో ఎంతో మంది వికలాంగులు, మహిళలు, ఎస్టీ, ఎస్సీలు ఉన్నారు. ఆక్రమణదారులపై ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల చట్టం కింద అట్రాసిటీ కేసు నమోదు చేయాలి. ఓ ఆక్రమణకు సంబంధించి గతేడాది ఏప్రిల్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారానికి నోచుకోలేదు. రశీదు నెంబర్ ఇచ్చి చేతులు దులుపుకొన్నారే తప్ప సమస్యను పరిష్కరించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

- రాపాక రవీందర్

రుణమాఫీ ఉండదా?

రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రుణమాఫీ పథకాన్ని ఎత్తివేయనున్నదనే పత్రికా కథనాలు రైతులను గందరగోళ పరుస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి బ్యాంకుల నుంచి రెండు లక్షల రుణాలు తీసుకోవాలని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న మొట్టమొదట రుణమాఫీ చేస్తామని గప్పాలు కొట్టాడు. ఆయన మాటలు విని రైతులు బ్యాంకులకు క్యూ కట్టారు. ఆ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. సుమారు 4 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం రుణమాఫీ ఊసే ఎత్తడం లేదు. ఇక రుణమాఫీ ఉండదనే వరుస కథనాలతో ప్రజలు డోలాయమానంలో ఉన్నారు.

- ఎడ్ల స్వామిరెడ్డి